ప్రయత్నాలు చేయగూడదన్న నిర్ణయానికి గూడా వచ్చాను. అంతా వనుకున్నట్టే జరిగితే యిక ఈ ప్రపంచ నాటకం రక్తిగట్టదేమో! ఇన్నాళ్ళకి, ళ్ళకు మళ్ళీ రంగనాధంతో పనిబడింది. కాని ఈసారి నేను టెలిఫోను, కాలింగ్ బెల్ మొదలైన ఉపకరణాలను నమ్ముకోలేదు. స్వయంగా నా కళ్ళనే నమ్ముకున్నాను.

తరువాతి కథ మీకు తెలిసిందే! వచ్చి చూచేసరికి మిత్రుడు కాదు సరిగదా చీమలు దోమలులాంటి క్రిమికీటకాలు దూరబడడానికైనా వీల్లేకుండా తలుపు, కిటికీలు బంధింపబడివున్నాయి. గోడపైన బోర్డుగానీ బటన్‌గానీ కనిపించటంలేదు. అరుగుపైన కూలబడి పదిహేను నిమిషాలు వేచి చూశాను. వేసిన తలుపు వేసినట్టేవుంది.

ఆ క్షణాన నా కీ లోకానికి రంగనాధానికీ మధ్య అనుభూతంలా నిలిచివున్న ఆ తలుపుపైన పట్టరానంత కోపం వచ్చింది. బలంకొద్దీ నాలుగు పిడిగుద్దులు ప్రసాదించి దాన్ని బ్రద్దలు చేసేయాలన్నంత ఉక్రోషం గూడా కలిగింది. భావ ప్రకోపానికే గనుక బలంవుంటే నా కోపతాపాలకే ఆ తలుపు నుగ్గునూచమై పోయివుండవలసింది. అంతవని జరగలేదుగానీ ఆతిధ్యం లభించనందుకు కినిసి కాశీ నగరాన్ని శపించబోతున్న దూర్వాస మహర్షికి అన్నపూర్ణ ప్రత్యక్షమైనట్టుగా తటాలున తలుపుతెరుచుకుంది..

"మీరా అన్నయ్యా! ఇంకా ఎవరో అనుకున్నాను. కూచుందురుగానీ లోపలికి రండి" అంది రంగనాధం భార్య.

అలాగైతే పదినిమిషాలకు మునుపు నేను తలుపు తట్టడం ఈమెకు వినిపించిందన్నమాట!

"ఈ మధ్య మనుషులు రావడం మరీ ఎక్కువైపోయింది. వచ్చిన వాళ్ళకు బదులు చెప్పలేక ప్రాణాలు పోతున్నాయి. ఏమని చెప్పుకోనన్నయ్యా! నా అవస్థ ఆ భగవంతునికే ఎరుక!"

నిజమే గావచ్చు! సమాజంలో అంతస్థు పెరిగిన కొద్దీ మనుషులతో బెడదగూడా పెరుగుతుంది. గొప్ప వాడంటూ ఒకడుంటే అతనికీ ఒక వంద మందైనా ప్రక్కవాళ్ళుండడం లోక సహజం! ఒకవిధంగా అది గర్వ కారణం గూడా! ఆమాటే పార్వతమ్మతో చెబుదామనుకున్నాను. చెప్పకపోవడమే మంచిదైంది!

ఆమె చెప్పుకపోతోంది.

"నెలరోజులైంది ఈయన వూరు విడిచివెళ్ళి! ఎక్కడికి వెళ్ళారో తెలియదు. వ్యాపారసాహారాలు కట్టిపెట్టి ఆరు మాసాలైంది. ఊరిలో ఎవరెవరికి ఎక్కడెక్కడ ఎన్నెన్ని అప్పులున్నాయో తెలియదు. చిల్లరంగడివాడు రెండు వందలదాకా లెక్క చెబుతున్నాడు. ఇంటద్దె నాలుగుమాసాలుగా బకాయి. గంటకొకరురగా, అరగంటకొకరుగా అప్పులవాళ్ళు యింటిపై కొస్తున్నారు. తలుపుపైన సవ్వడి వినిపిస్తే గుండె జల్లుమంటుంది. పగటివేళ నాకెలాగో గడచిపోతుంది. ప్రొద్దుపోయి చీకటి పడితే ఈ లంకలంత యింట్లో నా నీడే నన్ను భయపెడుతుంది. పులిమీద పుట్రలాగా ఈ ఎలక్ట్రిసిటీ వాళ్ళొకరు. రెండు నెలలుగా బిల్లు చెల్లించలేదేమో, ఎప్పుడెప్పుడు లోపలికొచ్చి ఈ ఫ్యూజు కాస్తా వూడలాక్కుని వెళ్ళిపోదామా అని చూస్తున్నారు! ఈ యింట్లో రాత్రయ్యేసరికి దీపాలుగూడా వెలుగకపోతే యిక నాగతేమౌతుందో నాకే తెలియడంలేదు..."

ఆ పరిస్థితిలో నాలుగు ఓదార్పు మాటలు చెప్పడంకన్నా నేను చేయగలిగిందేమీ లేకపోయింది. సెలవు తీసుకుని బయటకివస్తూ తలుపువైపొక సారి చూచాను. ఎందుకో ఉన్నట్టుండి దానిపట్ల నాకు గౌరవభావం కలిగినట్లు తోచింది.

ఎందుకని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. ప్రశ్నకు సమాధానంగా నా వెనుకవైపున రంగనాధం భార్య తలుపుమూసి గడియ పెట్టుకుంటున్న చప్పుడు వినిపించింది! ●

(1964 దీపావళి జ్యోతి నుంచి)

---

# తనదాకా వస్తే...

## ఎస్.ఆర్. స్వామి

తాగుతున్న చుట్ట వట్టిలోకి విసరేసి లేచి నించున్నాడు నాయుడు.

అమ్మగారి జాడ లేదు. పొద్దున్ననగా అమ్మగారు తీసుకెళ్ళిన అతని భార్య మిగతా ఆడకూలీలు ఇంకా రాలేదు.

పశ్చిమాన ఎవరో విసిరేసిన చుట్ట ఆరిపోయింది.

అమ్మగారు వస్తే గానీ ఇంటికి వెళ్లలేడు నాయుడు. అమ్మగారు రావాలి, నిన్నటి కూలి ఇవ్వాలి. కూలీ ఇవ్వనిదే సరుకులు కొనుక్కుని ఇంటికి వెళ్ళలేడు. ఇంటి దగ్గర పిల్లలు ఎదురు చూస్తుఉంటారు.

నిన్ననే అమ్మగారి దగ్గర పనిలో చేరారు నాయుడు, అతని భార్య. అమ్మగారు ఎంతో మంచి వారని నాయుడుతో పని చేసే పెడితల్లి అన్నాడు. అప్పుడప్పుడు ఆడ కూలీలను అమ్మగారు సభలకు తీసుకొని వెళతారుట. ఆడవానికి మగవాడితో సమాన హక్కులు ఉండాలని, అలాంటి సభలలో అమ్మగారు ఆవేశంతో ఉపన్యాసిస్తారట. అలాంటి రోజుల్లో ఆడ కూలీలకు భోజనం పెట్టి, రోజుకూలీ కూడా ఇస్తారట.

నాయుడు మరో చుట్ట వెలిగించాడు. ఆకాశంలో జరిగే సంతలో తారా దీపాలు వెలిగేయి.

అమ్మగారి కారు గేటు దగ్గర ఆగింది. ఆడ కూలీలను తీసికెళ్ళిన లారీ రాలేదు.

గేటువైపు చూస్తూ నించున్న నాయుడిని ఆశ్చర్యంగా చూశారు ఆవిడ.

"ఇంట్లో సరకులు బొత్తిగా అయిపోనాయండి. నిన్నటి కూలీ ఇప్పిస్తే...."

ఆవిడ పర్సుతీసారు. ముప్పై అయిదు రూపాయలు నాయుడు చేతిలో పెట్టి అన్నారు "నిన్నటి నీ కూలి ఇరవై, మీ ఆవిడది పదిహేను".

డబ్బుపుచ్చుకొని కూడా తల గోక్కుంటూ నిలుచున్న నాయుడిని ఆశ్చర్యంగా చూసింది. "ఇంకేమైనా కావాలా?"

"ఇంకేం వద్దండి అమ్మగారూ! అయినా నాకు తెలీక అడుగుతున్నా. నేనూ, మా ఆడదీ ఒకే టైముకి పనిలోకి ఎక్కామండీ. ఒక్కలాగే మట్టి తట్టలు మోసామండీ. అయినా నాకు ఇరువై, దానికి పదిహేను ఇచ్చారని..." మెల్లిగా గొణిగాడు నాయుడు. "మీరే అంటున్నారు కదండీ ఆడా మొగా సమానమని."

ఆ ప్రశ్నవిని నిశ్చేష్టురాలై నిలబడిపోయింది ఆవిడ. ●